


నేడు సిపిఎం జిల్లా విస్తృత సమావేశం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి జిల్లా సిపిఎం విస్తృత సమావేశం ఆదివారం ఉదయం 10.30 గంటలకు యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో ప్రారంభమవుతుందని జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మూలం రమేష్, రాష్ట్ర కమిటి సభ్యులు దడాల సుబ్బారావు హాజరుకానున్నారు. కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సమీక్ష నివేదికపై చర్చ ఉంటుందని తెలిపారు. స్కీం వర్కర్లపై రాజకీయ వేధిపులు, ప్రజా సమస్యల పరిష్కారంపై సమావేశం పలు నిర్ణయాలు తీసుకోనుంది.

పుష్పిత్ స్టీల్ ఫ్యాక్టరీలో వలస కార్మికుడు మృతి



పైనుంచి పడడంతో కార్మికుని తలకు గాయం

ప్రజాశక్తి - ఏర్పేడు

ఏర్పేడు మండలం మేర్లపాక పంచాయతీలోని పుష్పిత్ స్టీల్ ప్రైవేట్ లిమిటెడ్ ఫ్యాక్టరీలో వెల్డింగ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు పైనుంచి పడి జార్ఖండ్‌కు చెందిన కార్మికుడు మృతిచెందాడు. పది రోజుల క్రితమే కాంట్రాక్టర్ జార్ఖండ్ రాష్ట్రం నుంచి కార్మికుల గుంపును తీసుకొచ్చారు. వీరు ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుంచి పనుల్లో ఉంటారు. శుక్రవారం ఉదయం 8.30 గంటలకు బిక్రమ్‌హ్యాండ్స (24) పైకి ఎక్కి వెల్డింగ్ చేస్తుండగా పైనుంచి పడి తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఫ్యాక్టరీలో ఎటువంటి సేఫ్టీ సదుపాయాలు లేకపోవడం గమనార్హం.

రూ.25లక్షలివ్వాలని సిఐటియు డిమాండ్

ఫ్యాక్టరీ యాజమాన్యం గుట్టు చప్పుడు కాకుండా కాంట్రాక్టర్‌తో కలిసి సహచర కార్మికులకు ఎవరికీ చెప్పకుండా మృతదేహాన్ని దాచేశారు. అయితే మిగతా కార్మికులు బిక్రమ్ హ్యాండ్స ఎక్కడ? అని ప్రశ్నించడంతో పైనుంచి పడ్డాడని, ఆస్పత్రికి తీసుకెళ్లామని చెప్పారు. శనివారం మృతదేహాన్ని రేణిగుంటలోని అమర ఆస్పత్రికి తీసుకెళ్లగా డాక్టర్ పరిశీలించి చనిపోయాడని తెలిపారు. ఏర్పేడు సిఐ శ్రీరామ శ్రీనివాసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఫ్యాక్టరీలో ఎటువంటి భద్రతా చర్యలు లేవని, ఇన్స్యూరెన్స్ సౌకర్యం కూడా లేదని కార్మికులు వాపోయారు. లేబర్ ఇన్స్యూరెన్స్ పాటించలేదని, మెడికల్ ఎమర్జన్సీ అంతంతమాత్రంగానే ఉందని పేర్కొన్నారు. సిఐటియు, రైతుసంఘం నాయకులు మాట్లాడుతూ మృతుని కుటుంబానికి న్యాయం చేయకపోతే ధర్నా చేస్తామని హెచ్చరించారు. బిక్రమ్ హ్యాండ్స కుటుంబానికి రూ.25 లక్షలు పరిహారం అందించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య, కార్యదర్శి పెనగడం గురవయ్య డిమాండ్ చేశారు. సరైన రక్షణ పరికరాలు లేకపోవడం వల్లనే తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ స్పందించి పుష్పిత్ పరిశ్రమకు నోటీసులు పంపి కార్మికుల భద్రతకు పెద్దపీట వేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.



మృతిచెందిన జార్ఖండ్ వలస కార్మికుడు

తిరుపతి మున్సిపల్ కమిషనర్‌గా నారపురెడ్డి మౌర్య

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో



నారపురెడ్డి మౌర్య

తిరుపతి మున్సిపల్ కమిషనర్‌గా నారపురెడ్డి మౌర్యను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ పనిచేస్తున్న అదితిసింగ్‌ను బదిలీ చేశారు. అదితిసింగ్‌ను కడప జిల్లా జాయింట్ కలెక్టర్‌గా బదిలీ చేశారు. 2018 ఐఎఎస్‌కు చెందిన బ్యాచ్ నారపురెడ్డి మౌర్య. కర్నూలు జిల్లాలో జాయింట్ కలెక్టర్‌గా పనిచేసిన ఆమె నూతనంగా ఏర్పడిన టిడిపి కూటమి హయాంలో శనివారం 67 మంది ఐఎఎస్‌లను భారీగా బదిలీ చేసింది. ఈ బదిలీల్లో భాగంగా నారపురెడ్డి మౌర్య తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా రానున్నారు. తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్ జ్ఞానచంద్ర విజయవాడ మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. 2020 ఐఎఎస్ బ్యాచ్‌కు చెందిన శుభం భన్సల్ ఐటిడిఎ ప్రాజెక్టు ఆఫీసర్‌గా సీతారాంపేటలో పనిచేస్తూ తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్‌గా రానున్నారు.




శుభం భన్సల్

ఇన్‌ఛార్జి వీసీకి అభినందనలు

ప్రజాశక్తి - క్యాంపస్

శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం నూతన ఇంచార్జ్ ఉపకులపతి ఆచార్య అప్పారావును ఆల్ యూనివర్సిటీస్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి గండికోట నాగవెంకటేష్ 'ఎర్రజెండా నీడలో' పుస్తకాన్ని బహుమతిగా ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. విద్యావిభాగం అకడమిక్ కన్సల్టెంట్ డాక్టర్ నూకల కిషోర్ పాల్గొన్నారు.



రెండు గ్రామాలను భువనేశ్వరి దత్తత

23-26 తేదీల్లో కుప్పంలో పర్యటన

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

'కుప్పం నియోజకవర్గంలో ఏ బూత్ పరిధిలో నారా చంద్రబాబునాయుడుకు భారీ మెజార్టీని ఇస్తుందో ఆ గ్రామాలను దత్తత తీసుకుంటా' అని ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి సతీమణి నారా భువనేశ్వరి హామీ ఇచ్చారు. ఈ మేరకు కుప్పం మండలం పైపాళ్యం, గుడిపాల మండలం కంచిబందార్లపల్లి గ్రామాల్లో భారీ మెజార్టీ వచ్చింది. కంచిబందార్లపల్లి బూత్‌లో టిడిపికి 1256 ఓట్లు మెజార్టీ వచ్చింది. అలాగే పైపాళ్యం బూత్ పరిధిలో 1,053 ఓట్లు మెజార్టీ వచ్చింది. వైసిపికి ఆ రెండు బూత్‌ల్లో కనీసం 35శాతం కూడా ఓట్లు పడలేదు. ఈ నేపథ్యంలో ఈనెల 23-26 తేదీల్లో కుప్పం నియోజకవర్గంలో నారా భువనేశ్వరి పర్యటించి, ఆ గ్రామాలను దత్తత తీసుకునే విషయమై అధికారికంగా ప్రకటించనున్నట్లు కుప్పం నియోజకవర్గ ఇన్‌ఛార్జి, ఎంఎల్‌ఎ కంచర్ల శ్రీకాంత్ వెల్లడించారు. అలాగే టిడిపి కూటమి అధికారంలోకి వచ్చాక తొలిసారిగా కుప్పం రానున్న నారా భువనేశ్వరికి కుప్పం, రామకుప్పం, శాంతిపురం, గుడిపల్లి మండలాల్లో పర్యటించి, ప్రజా సమస్యలను తెలుసుకుని, ప్రణాళికా బద్ధంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోనున్నారు.



గురుకుల పాఠశాలలో మరమ్మతు పనులు పరిశీలిస్తున్న కలెక్టర్

గురుకులాల్లో పిల్లల బాధ్యత టీచర్లదే : కలెక్టర్

ప్రజాశక్తి - నాయుడుపేట

గురుకులాల్లో పిల్లల సంరక్షణ బాధ్యత పూర్తిగా టీచర్లు, సిబ్బందిదేనని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. నాయుడుపేట మున్సిపాలిటీలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ బాలుర గురుకుల పాఠశాలలోని పిల్లలు గత ఆదివారం కలుషిత ఆహారం తిని ఆస్పత్రి పాలై కోలుకుంటున్నారు. ఈ నేపథ్యంలో గురుకుల పాఠశాలను కలెక్టర్ శనివారం సందర్శించారు. మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఎలక్ట్రికల్ తదితర మరమ్మతులు నాణ్యతగా పూర్తి స్థాయిలో చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. మరమ్మతుల అంచనా విలువ దాదాపు 56 లక్షలు కాగా, ఏపి సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్ సొసైటీ రూ.25 లక్షలు విడుదల చేసింది. మరమ్మతులు నాలుగైదు రోజుల్లో పూర్తి కావాలని ఆదేశించారు. ఈఈ, ఏపీ ఈడబ్ల్యూఐడిసి బాలసుబ్రమణ్యం రెడ్డి, నాయుడుపేట మునిసిపల్ కమిషనర్ జనార్ధన్ రెడ్డి, ఎంపిడిఓ మాధవి లత పాల్గొన్నారు.

సామాన్య భక్తులకు పెద్దపీట : ఈవో

ప్రజాశక్తి - తిరుమల



ప్రపంచ నలుమూలల నుండి ప్రతి రోజూ వేలాదిగా తిరుమలకు విచ్చేసే సామాన్య భక్తులకు మరింత సౌకర్యవంతంగా దర్శనం, వసతి, అన్న ప్రసాదాలు అందించేందుకు చర్యలు చేపట్టినట్లు టీటీడీ ఈవో జె. శ్యామలరావు చెప్పారు. అదేవిధంగా తిరుమల పవిత్రతను మరింతగా పెంపొందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఈవో తెలిపారు. తిరుమల గోకులం విశ్రాంతి భవనంలోని సమావేశ మందిరంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు తిరుమలలోని అన్ని విభాగాలను నెల రోజుల పాటు క్షేత్రస్థాయిలో పరిశీలించినట్లు చెప్పారు. ఇందులో భాగంగా మాతశ్రీ తరిగొండ వెంగమాంబ అన్న ప్రసాద భవనంలో ప్రతిరోజూ రెండు లక్షల మంది భక్తులకు అందిస్తున్న అన్న ప్రసాదాలు, పాలు, తాగునీరు నాణ్యతను మరింత పెంచేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఇందుకు సంబంధించి ఉదయం అల్పాహారము, మధ్యాహ్నం, రాత్రి భోజనాలలో భక్తులకు అందించవలసిన ఆహార పదార్థాలను నిర్ణయించినట్లు తెలిపారు. ఇందుకోసం ప్రముఖ ఆహార పదార్థాల తయారీ నిపుణులతో కమిటీని ఏర్పాటు చేసి, వారు సూచించిన విధంగా అన్నప్రసాద భవనంలో సిబ్బందిని పెంచడం, వంటశాలల ఆధునీకరణ, మెరుగైన పారిశుధ్య నిర్వహణ, తదితర అంశాలపై చర్యలు తీసుకుంటున్నామన్నారు. తిరుమలలో ఫుడ్ సేఫ్టీ విభాగం (ఎఫ్‌ఎస్ డి) వారు ఏర్పాటుచేసిన మొబైల్ ల్యాబ్ లో 80 రకాల పదార్థాలను పరీక్షించవచ్చని చెప్పారు. తిరుమలలో హోటల్ నిర్వాహకులు టీటీడీ నిబంధనల ప్రకారం ఆహార పదార్థాల తయారీ, నాణ్యత, రేట్లు ఉండాలన్నారు. లీజు దారులు సబ్ లీజుకు ఇవ్వకూడదని, తదితర అంశాలతో నూతన పాలసీని తీసుకురానున్నట్లు తెలిపారు. టీటీడీ ఐటి వ్యవస్థను మరింత బలోపేతం చేసి ఆర్జిత సేవలు, దర్శనము, వసతి తదితర సేవల బుకింగ్‌లో లోపాలను సరిదిద్దుతామన్నారు. గతంలో వారానికి 1.05 లక్షలు ఇస్తున్న ఎస్ఎస్‌డి టోకెన్లను, భక్తులు క్యూలైన్లలో వేచి ఉండే సమయం తగ్గించేందుకు ప్రస్తుతం 1.47 లక్షలు ఇస్తున్నామని, వీటిని మరికొంత పెంచేందుకు సాధ్యాసాధ్యాలు పరిశీలిస్తామన్నారు. ఈ సమావేశంలో జేఈవో వీరబ్రహ్మం, సిపిఆర్‌ఓ డాక్టర్ రవి, పాల్గొన్నారు.

గంజాయి మత్తులో.. బాలికలకు భద్రతేది..?

ప్రజాదృష్టి

ప్రజాశక్తి-తిరుపతి సిటి

మద్యం మత్తులో మహిళలు బలి అవుతున్నారన్నది ఒకప్పటి మాట.. ప్రస్తుతం మద్యానికి గంజాయి తోడయ్యింది.. దీంతో అకృత్యాలకు వావివరుసలు లేకుండా పోయాయి. బాలికలకు భద్రత లేకుండా పోయింది.. గంజాయి మత్తులో యువత ఏం చేస్తుందో తెలియనంతగా తూగుతోంది. గత వైసిపి పాలనలో అప్పటి తిరుపతి ఎంఎల్‌ఎ భూమన కరుణాకర్‌రెడ్డి మారువేషాల్లో సైకిల్‌పై సవార్ చేస్తూ గంజాయి లేకుండా చేస్తానని ప్రతినబూనారు. సందుగొందులన్నీ తిరిగారు.. ఫొటోలకు ఫోజులిచ్చారు. టిడిపి మాజీ ఎంఎల్‌ఎ సుగుణమ్మ వైసిపి హయాంలో గంజాయి విచ్చలవిడిగా విక్రయాలు చేశారని ప్రస్తుతం ఆరోపిస్తున్నారు. మరి కూటమి పాలనలోనైనా గంజాయి అందుబాటులో లేకుండా చేస్తారా? లేదా అన్నది వేచి చూడాల్సిందే.

జిల్లాలో మత్తుపదార్థాల వినియోగం పెట్రేగిపోతోంది. బంగాకు (గంజాయి)కు బానిసవుతున్న ఆకతాయిలు ఆ మత్తులో అరాచకాలకు పూనుకుంటున్నారు. అభం శుభం తెలియని చిన్నారులపై అఘాయిత్యాలకు తెగబడుతూ వారి జీవితాలను ఛిద్రం చేస్తున్నారు. మరికొంత మంది మరణాయుధాలతో దాడులకు దిగి, ప్రాణాలను హరించేస్తున్నారు. గడిచిన వారం రోజుల్లోనే ఈ కోవలో జిల్లా వ్యాప్తంగా నాలుగు ఘటనలు చోటు చేసుకోవడం గమనార్హం. జిల్లాలో వరుసగా జరుగుతున్న ఘటనలతో బాలికల భద్రతపై నీలినీడలు కమ్ముకున్నాయి.

తిరుపతి జిల్లా ప్రశాంతతకు నిలయం. ప్రపంచ ప్రసిద్ధిగాంచిన ఆధ్యాత్మిక క్షేత్రాలు, విహారయాత్ర స్థలాలు, పదుల సంఖ్యలో అత్యున్నత విద్యాకేంద్రాలు, ఎనిమిదికిపైగా విశ్వవిద్యాలయాలు, భారీ పారిశ్రామిక వాడ, అంతరక్ష ప్రయోగవేదిక ఇస్రో నెలకొన్న స్థలం. సముద్రతీరం ఉన్న ప్రదేశం. అనునిత్యం వివిఐపిల రాకపోకలు సాగించే ఏకైక జిల్లా తిరుపతి. ఇంతటి ప్రసిద్ధిగాంచిన జిల్లాలో ఇటీవల బాలికలపై వరుసగా చోటు చేసుకుంటున్న ఘటనలో ప్రజలను కలవరపాటుకు గురి చేస్తున్నాయి. నాలుగు రోజుల క్రితం దొరవారిసత్రం మండల పరిధిలోని నెలబల్లి గ్రామ సరిహద్దుల్లో ఉన్న రైస్‌మిల్లు అటవీప్రాంతంలో ఎనిమిదేళ్ల చిన్నారని, బీహార్‌కు చెందిన ఓ యువకుడు గంజాయి మత్తులో అపహరించి, అత్యాచారం చేసి, హత్య చేసిన ఘటన మరవకముందే ఏర్పేడు మండలం మునగలపాలం పంచాయతీ పరిధిలోని మూల కండ్రిగ గ్రామంలో చిన్నారులపై లైంగికవేధింపులు జరిగాయి. బలరామయ్యగౌడ్ అనే మానవమృగం ఈ దారుణానికి ఒడిగట్టాడు. గతంలో ఓ చిన్నారిని అత్యాచారం చేసిన కేసులో జైలు శిక్ష సైతం అనుభవించాడు. జైలు నుంచి విడుదలైన తర్వాత కూడా మత్తుకు అలవాటుపడి ఇలాంటి దారుణాలకు ఒడికట్టడం బాధాకరం. గూడూరు రెండో పట్టణ పరిధిలో ఇంటర్మీడియట్ చదువుతున్న ఓ బాలికను రెండు రోజుల క్రితం ఓ రౌడీషీటర్ బాలిక ఇంటి ముందే కత్తితో బెదిరించి, బలవంతంగా ఆటోలో ఎక్కించుకునిపోయి అత్యాచారం చేసి, సాయంత్రం ధైర్యంగా కిడ్నాప్ చేసిన పరిసరాల్లో వదిలేచి జారుకున్నాడు. ఈ ఘటనతో అవమానాన్ని భరించలేక బాధితురాలు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి, ప్రస్తుతం ఆసుపత్రుల్లో ప్రాణాపాయస్థితిలో కొట్టుమిట్టాడుతోంది. గురువారం రాత్రి తిరుపతి నడిబొడ్డున తమ బిడ్డతో అసభ్యకరంగా మాట్లాడడం సరైనది కాదన్న కారణంతో ఓ యువకుడు ఇంటిలోకే చొరబడి కత్తితో దారుణంగా నరికి ఓ వృద్ధురాలిని హత్యచేసి, మరో ముగ్గురిపై కత్తితో దాడికి తెగబడ్డాడు. అందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉండగా, మరో ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. ఇదే కుటుంబంపై రెండు సంవత్సరాల క్రితం దాడి జరిగిన, భద్రత కల్పించడంలో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం శోచనీయం. ఇవి అధికారికంగా పోలీసుల కేసు నమోదు చేసిన ఘటనలు. కేసు



నమోదు చేయనవి ఎన్నో. జిల్లాలో వరుసగా జరుగుతున్న ఘటనలతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. ఘటనలు జరిగాక స్పందించడం కంటే ఇలాంటివి పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు చేపట్టాల్సిన పోలీసు యంత్రాంగం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించడం బాధాకరం. మునగలపాలెంలో చిన్నారిపై అత్యాచారం చేసిన నిందితుడు గతంలోనూ ఇలాంటి దారుణానికి పాల్పడి, జైలు శిక్షణ అనుభవించిన పరివర్తన లేదు, పైగా అతనిపై కనీస నిఘా కూడా పెట్టలేదు. గుడూరులో ఘటన కూడా గత మూడేళ్లుగా నిందితుడు వేధిస్తున్నా ఎలాంటి చర్యలు లేవు. తిరుపతి ఘటన సైతం, ఇదే కుటుంబంపై రెండేళ్ల క్రితం దాడి జరిగింది. దీంతో భయాందోళన చెందిన బాధిత కుటుంబం తమ కుమార్తెను వారికి దూరంగా సుదూర ప్రాంతంలో చదివిస్తున్నారు. సెలవుపై ఇంటికి వచ్చిన సమయంలో దాడి ఘటన చోటు చేసుకుంది. నిందితులకు కఠిన శిక్షలు పడేలా చేస్తే కొంత మార్పు తీసుకురావచ్చని ప్రజాసంఘాలు కోరుతున్నాయి. పోలీసు యంత్రాంగం స్పందించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని, ఆ దిశగా చర్యలు తీసుకుంటారని ఆశిద్దాం...!

నాని మాతో సఖ్యతగా ఉండేవాడు : చెవిరెడ్డి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో ప్రస్తుత చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే పులివర్తి నాని మంత్రి పెద్దిరెడ్డితో, అప్పటి ఎమ్మెల్యేగా ఉన్న తనతో ఎంతో సఖ్యతగా ఉండి తన ఆర్థిక వ్యవహారాలను చక్క దిద్దుకుని ఎదిగారని చంద్రగిరి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అన్నారు. శనివారం తిరుపతిలోని ఓ ప్రైవేటు హోటల్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా ప్రతినిధి అంటే ఎంతో హుందాగా నడుచుకుంటూ ఆదర్శవంతంగా ఉండాలని, కానీ ఎమ్మెల్యే పులివర్తి నాని విచక్షణ కోల్పోయి తనను ఒరే అని మాట్లాడటం చిత్తూరు సంస్కతిని ఇక్కడ తీసుకువచ్చారని స్పష్టమవుతుందన్నారు. ఇలాంటి సంస్కతి గల వారిని ప్రజలు పక్కన పెడతారన్నారు. చదువుకున్నవారికి ఎంతో విజ్ఞతతో కూడిన మాటలు వస్తాయని, ఎమ్మెల్యే పులివర్తి నాని అఫిడవిట్ పరిశీలిస్తే ఆయన విద్యార్హత పదవ తరగతి ఉందని అన్నారు. తాము అధికారంలో ఉన్నప్పుడు ఏనాడూ పులివర్తి నానికి సంబంధించిన క్వారీలు, లారీలు, పాలిష్ ఇండస్ట్రీని సజావుగా సాగనిచ్చామే తప్ప ఎక్కడ ఇబ్బంది పెట్టలేదన్నారు. కిలారి రాజేష్ పేరు చెప్పి దందాలు, అక్రమాలు పులివర్తి నాని చేయలేదా అని ప్రశ్నించారు. తాము ఎటువంటి అరెస్టులకు భయపడే ప్రసక్తే లేదని, తుడాలో జరిగిన అవినీతిపై విచారణ చేయాలని తానే స్వయంగా సీఎంకు లేఖ రాశానని చెప్పారు.

మమ్మల్ని ఢీ కొట్టాలంటే ప్రజల్లోకి రావాలి : పులివర్తి సుధారెడ్డి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

చంద్రగిరి నియోజకవర్గ ప్రజలు ఇచ్చిన తీర్పును జీర్ణించుకోలేక మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి మతిస్థిమితాన్ని కోల్పోయి తమ కుటుంబంపై నిరాదార ఆరోపణలను చేస్తూ ప్రజలలో అలజడి సష్టించాలనే ప్రయత్నాలను మానుకోవాలని చంద్రగిరి ఎమ్మెల్యే సతీమణి పులివర్తి సుధారెడ్డి హితవు పలికారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రాజకీయాలపై మక్కువతో పులివర్తి నాని చాలా కాలం క్రితమే వ్యాపారాలు వదలి ప్రజల్లోకి వెళ్లారని, అప్పటినుండి తానే వ్యాపార కార్యకలాపాలను నడిపిస్తున్నానని అన్నారు. తమకు సంబంధించిన క్వారీలపై అపరాధ రుసుము వేయడంపై కోర్టును ఆశ్రయించామని, కోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వుల మేరకు ఇప్పటివరకు క్వారీలను నడుపుతూ వస్తున్నామన్నారు. పదవ తరగతి చదివిన వ్యక్తి నేడు చంద్రగిరి ఎమ్మెల్యే అయ్యాడని, అధికారంలో ఉన్న సమయంలో చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఇప్పుడు నెల రోజుల్లో ఎమ్మెల్యేగా పులివర్తి నాని చేస్తున్న కార్యక్రమాలను ఎందుకు చేయలేకపోయారో ఆలోచించుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వం గెలిచి నెల రోజులే అవుతున్న అప్పుడే చిచ్చులు పెట్టాలని ప్రయత్నం చేయడం మంచి పద్ధతి కాదన్నారు. ఇకపై తన కుటుంబ సభ్యులపై ఆరోపణలు చేస్తే కోర్టును ఆశ్రయిస్తానని హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో తిరుపతి రూరల్ మండలం టిడిపి అధ్యక్షులు ఈశ్వర్ రెడ్డి, మహిళా అధ్యక్షురాలు రామాంజేరి మహేశ్వరి పాల్గొన్నారు.

ప్రమాణానికి సిద్ధమా చెవిరెడ్డి : కుమార్ రాజారెడ్డి

చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అవినీతి అక్రమాలకు పాల్పడలేదని, దౌర్జన్యాలు చేయలేదని ధైర్యంగా చంద్రగిరి గ్రామ దేవత శ్రీమూలస్థాన ఎల్లమ్మ ఆలయంలో సత్యప్రమాణానికి సిద్ధం కావాలని టిడిపి సీనియర్ నాయకులు కుమార్‌రాజా సవాల్ విసిరారు. రెండు రోజులుగా ఎంఎల్‌ఎ పులివర్తి నానిపై బురదజల్లే కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. ఈ విలేకరుల సమావేశంలో పల్లినేని సుబ్రమణ్యం నాయుడు, ముడిపల్లి సురేష్‌రెడ్డి, గౌస్‌బాష, బాలకృష్ణ పాల్గొన్నారు.

22 కేజీల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి - గూడూరు టౌన్

అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురిని అరెస్టు చేసిన సంఘటన గూడూరు జాతీయ రహదారి పోటు పాలెంజంక్షన్ వద్ద చోటు చేసుకుంది. శనివారం గూడూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో డి.ఎస్పీ సూర్యనారాయణ రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చెప్పిన వివరాల మేరకు.. తమిళనాడు రాష్టానికి చెందిన ముగ్గురు రామక్రిష్ణన్, సతీష్‌కుమార్, మురగన్ ఆనందకుమార్ ఒడిస్సా రాష్ట్రంలో గంజాయిని కొనుగోలు చేశారు. వీరు ఒడిస్సా నుండి గూడూరుకి రైలులో వచ్చి గూడూరు రైల్వే స్టేషన్‌లో దిగారు. అక్కడి నుండి చెన్నై కి వెళ్ళుటకు ఆటోలో గూడూరు జాతీయ రహదారి కూడలికి చేరుకున్నారు. వాహనాల సాధారణ తనిఖీల్లో భాగంగా వారిని గూడూరు రూరల్ పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద 22 కేజీల గంజాయి, 3 సెల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. గంజాయి విలువ 2 లక్షల 50వేల రూపాయలు ఉంటుంది. ఎవరైనా అక్రమంగా గంజాయి విక్రయించిన, తరలించిన వారి పై చట్ట పరమైన చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో గూడూరు రూరల్ సీఐ వేణుగోపాల్ రెడ్డి , ఎస్. ఐ మనోజ్ కుమార్ పాల్గొన్నారు.



రెయిన్‌గేజ్... నో యూజ్..!

చెట్లు, ఫెన్సింగ్‌తో పర్యవేక్షణ లోపం

ప్రజాశక్తి - సత్యవేడు

అన్నదాతకు అత్యంత ఇష్టమైనది రెయిన్‌గేజ్.. వర్షపాతం నమోదైతే తమ పంట పండినట్లేనని భావిస్తారు.. అయితే సత్యవేడులోని రెయిన్‌గేజ్ చెట్లు, ముళ్లకంచెతో పర్యవేక్షణ లోపంగా ఉంది.. ఈ కారణంగా ఈ రెయిన్‌గేజ్‌లో నమోదయ్యే వర్షపాతం సరైనదా, కాదా అన్న అనుమానం అన్నదాతల్లో కలుగుతోంది. లోపభూయిష్ట వర్షపాత డేటాతో తమ కళు ్లగప్పుతున్నారని అన్నదాతలు వాపోతున్నారు.

సత్యవేడు రెవెన్యూ కార్యాలయానికి వెనుక భాగంలో వర్షమాపక కేంద్రం ఉంది. అయితే అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల చెట్లు, ఆవరణంతా ఫెన్సింగ్, భవన నిర్మాణ గోడలు రెయిన్‌గేజ్‌ను చుట్టుముట్టాయి. దీంతో ఖచ్చితమైన వర్షపాత సమాచారం నమోదు కావడానికి వీల్లేని పరిస్థితి. సాధారణంగా రెయిన్‌గేజ్ స్థాపించేటపుడు బహిరంగ ప్రదేశాన్ని ఎంచుకుని, తప్పనిసరిగా గరిష్టంగా 30 మీటర్ల దూరంలో లేదా భవన, చెట్ల అడ్డంకి ఎత్తు కంటే రెండింతలు ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటారు. తద్వారా వర్షపునీటికి ఎలాంటి అంతరాయం లేకుండా సేకరించి వాస్తవ వర్షపాతాన్ని మిల్లీమీటర్లలో ఖచ్చితంగా లెక్కించవచ్చు. కాని సత్యవేడులో వర్షమాపక కేంద్ర అధికారులకు



ఈ నియమ నిబంధనలేవీ పట్టినట్లు లేవు. వర్షపాతాన్ని సేకరించడానికి అవరోధంగా చెట్లు, భవన గోడలు, ఆవరణంతా చెట్లతో నిండిపోయి ఉంది. ఈ కారణంగా తప్పుడు సమాచారాన్ని అందిస్తున్నారని రైతులు వాపోతున్నారు. వ్యవసాయ రంగంలో రెయిన్‌గేజ్ ద్వారా సేకరించిన సమాచారం ముఖ్యపాత్ర పోషిస్తుంది. వర్షమాపక పరికరాలను ఉపయోగించడం ద్వారా వర్షపాతాన్ని పర్యవేక్షించి రైతులు ఎప్పుడు ఎంత అవపాతం పడుతుందో తెలుసుకొని ప్రణాళిక బద్ధంగా కరువు కాలంలో పరిమిత నీటి వనరులను సముచితంగా కేటాయించి నేల తేమను మెరుగుపరుచుకొనవచ్చు. అదేవిధంగా పరిమితికి మించి వర్షపాతం నమోదైనప్పుడు వరద నష్టాన్ని తగ్గించడానికి డ్రైనేజీ మార్గాలను తెరవడం ద్వారా ఖర్చు ఆదా, నేలను రక్షించుకొనవచ్చు. రెయిన్ గేజ్ల ద్వారా అందించబడిన డేటాను వాతావరణ సూచనలతో కలిపి వ్యవసాయ ఉత్పత్తిపై వాతావరణ మార్పులను ప్రభావాలను అధ్యయనం చేయడానికి, భవిష్యత్ వ్యవసాయ విధానం, సాంకేతిక అభివద్ధిని తెలియజేయడానికి దోహదపడుతుంది. రైతాంగం భవిష్యత్ వాతావరణ మార్పులకు మెరుగ్గా ప్రతిస్పందించడానికి ఎంతో సహాయపడుతుంది. రైతాంగానికి ఎంతో మేలు చేకూర్చే రెయిన్ గేజ్ లను సంబంధిత అధికారులు పర్యవేక్షించకుండా నిర్లక్ష్యం వహించడం ఎంతవరకు న్యాయమని, ఇలాంటి దుస్థితిలోని వర్షమాపక కేంద్రం నుండి నమోదైన సమాచారాన్ని రైతులకు వ్యవసాయ ప్రణాళికలను సిద్ధపరచుకోవడానికి ఇవ్వడం ముమ్మాటికి రైతులకు చేసే మోసమని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రెయిన్‌గేజ్ పరికరం చుట్టూ ఉన్న అవరోధాలను, అడ్డంకులను తొలగించాలని, సక్రమమైన, ఖచ్చితమైన వర్షపాత వివరాలను రైతులకు అందజేయాలని స్థానికులు కోరుతున్నారు.

శ్మశానం నిండా రాళ్లగుట్టలే

- అంతిమ సంస్కారానికి అవస్థలు
- పట్టించుకోని అధికారులు



రాళ్ల గుట్టలతో నిండిన శ్మశాన వాటిక

ప్రజాశక్తి - సత్యవేడు: శ్మశాన వాటికలో ఎటు చూసినా రాళ్ల గుట్టలు గుట్టలుగా కనిపిస్తాయి. దీంతో అంతిమ సంస్కారాలు నిర్వహించేందుకు వెళ్లిన వారికి ఇక్కట్లు తప్పడంలేదు. సరైన దారి సౌకర్యం లేక వారు పడుతున్న బాధలు వర్ణనాతీతంగా మారాయి. ఇన్ను అధికారులు, నాయకులు పట్టించుకోకపోవడంతో ఆ శ్మశాన వాటిక పరిధిలోని ప్రజలకు కష్టాలు తప్పడం లేదు.

సత్యవేడు మండలం అంబాకం పంచాయతీకి చెందిన పేరిడం గ్రామ శ్మశాన వాటికలో సమాధులు కనిపించనంతగా రాళ్ల గుట్టలే దర్శనమిస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. గ్రామంలో ఎవరైనా మృతి చెందితే వారి భౌతిక దేహాన్ని కుటుంబీకులు శ్మశాన వాటికలో పూడ్చి ఆ స్థలంలో సమాధి రాళ్లను నిర్మించుకొని వారి జ్ఞాపకార్థం సంవత్సరీకాలు నిర్వహించుకోవడం సర్వసాధారణం. ఈ గ్రామ శ్మశాన వాటిక పరిసర ప్రాంతంలోని కొందరు వారి సొంత స్థలాలను చదును చేయడంలో భాగంగా ఏరిన రాళ్ల గుట్టలను, చెత్తా చెదారాన్ని ట్రాక్టర్లలో యథేచ్ఛగా శ్మశాన వాటికలోకి తరలించి నింపుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఇప్పటికే శ్మశాన వాటిక సగభాగం రాళ్లగుట్టలతోనూ, చెత్తా చెదారాలతోనూ దర్శన మిస్తున్నాయన్నారు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే శ్మశాన వాటిక మొత్తం రాళ్ల గుట్టలతో, చెత్తా చెదారాలతో నిండి గ్రామంలో మృత దేహాలను రాళ్ల గుట్టలలోనే భూస్థాపితం చేసి రాళ్ల గుట్టలనే సమాధులుగా నిర్మించుకునే దుస్థితి ఏర్పడు తుందని పేర్కొంటున్నారు. ఈ శ్మశాన వాటిక ఆక్రమణలు గురవ్వ తొందని పేర్కొన్నారు. రెవెన్యూ అధికారులు స్పందించి శ్మశాన వాటికలో రాళ్ల గుట్టలు, చెత్తాచెదారాలను తొలగించి ఆక్రమణలు గురి కాకుండా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఏఎస్ఐకి రివార్డు బహూకరణ

ప్రజాశక్తి - తడ: ఒక వ్యక్తి ప్రాణాలు రక్షించినందుకు తడ ఎస్ఐ పి శ్రీకుమార్ రెడ్డికి ఎస్పీ సుబ్బారాయుడు శనివారం రివార్డు బహూకరించారు. తడ టోల్ లో నివసిస్తు శ్రీ సిటీలో పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్న వడ్డె సతీష్ కుమార్‌పై కాకినాడకు చెందిన రవీంద్రబాబు ఈ నెల 16వ తేదీ ఉదయం 8 గంటల సమయంలో దాడి చేశాడు. సతీష్ కుమార్ కు తీవ్రమైన గాయమైంది. తడ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న ఏఎస్ఐ 3309 శ్రీకుమార్ రెడ్డి బాధితుడిని చికిత్స నిమిత్తం రెడ్ హిల్స్ లోని రేలా హాస్పిటల్‌కు తీసుకెళ్లారు, అప్పటికే రక్తం ఎక్కువగా పోవడంతో అతనికి అత్యవసరంగా బి నెగెటివ్ గ్రూపు గల రక్తం అందించాలని డాక్టర్లు సూచించారు. అదే బ్లడ్ గ్రూప్ కలిగిన ఏఎస్ఐ పి. శ్రీకుమార్ రెడ్డి పెద్ద మనసుతో అతనికి రక్తదానం చేసి ఒక నిండు ప్రాణాన్ని కాపాడారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్పీ ఎల్ సుబ్బారాయుడు ఆ ఏఎస్ఐని అభినందించి రివార్డు అందించారు.

హైవే పక్కనే అక్రమ కట్టడాలు



ప్రజాశక్తి - తిరుపతి డెస్క్: ఏర్పేడు మండలం పంగూరు రోడ్డు వద్ద హైవేకు ఇరువైపులా దుకాణాలు యథేచ్ఛగా రోడ్డు మీదే అక్రమంగా కట్టడాలు కట్టేస్తున్నారు. రహదారుల శాఖ సిబ్బంది, అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. ఈ కూడలి వద్ద నుండి ఎక్కువ ఉన్న రాక్ మాన్, తిరుమల స్టీల్స్, విష్ణు కెమికల్, షే ఫుడ్ కంపెనీ, కెమికల్ ఫ్యాక్టరీ భారీ వాహనాల రాకపోకలు వెళుతుంటాయి. ఈ కూడలి ఇరుకుగా ఉండడం వల్ల భవిష్యత్తులో ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉందని చుట్టు పక్కల ప్రజల ఆందోళన చెందుతున్నారు. పక్కనే ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లే విద్యార్థులకూ ఈ కూడలి విశాలంగా లేకపోవడం వల్ల భవిష్యత్తులో పిల్లలు ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు వుందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. నిత్యం ప్రయాణించే అటుగా ఏర్పేడు - వెంకటగిరికి వెళ్లే వాహనాలు, ఇటుగా ఇండస్ట్రియల్ కారిడార్ కి వెళ్లే వాహనాల వల్ల బారికేడ్స్ అమర్చక పోవడం ఇబ్బందుల్లో పడే అవకాశం ఉందని తెలిపారు. అధికారులు, పోలీస్ సిబ్బంది వెంటనే స్పందించి అక్రమ నిర్మాణాలను తొలగించాలని , బారికేడ్స్ అమర్చాలని, చుట్టుపక్కల ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

కుష్టుపై భయం పోగొట్టాలి

ప్రజాశక్తి-తిరుపతి డెస్క్: కుష్టు వ్యాధిపై భయం పోగొట్టాలని జిల్లా కుష్టు వ్యాధుల నియంత్రణ అధికారి డాక్టర్ శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. యర్రావారిపాళెం మండలంలోని కస్తూరిబా పాఠశాలలో కుష్టు నియంత్రణపై విద్యార్థులకు శనివారం అవగాహన కల్పించారు. సిబ్బంది ప్రతి ఒక్కరూ మండలంలోని ప్రతి ఇంటికీ తిరిగి కుష్టు వ్యాధిపై భయం పోగొట్టే విధంగా సర్వే నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ లీనాకుమారి, డిప్యూటీ డెమో కిరణ్ కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్ కృష్ణమ్మ, ఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల అనర్థాలపై అవగాహన

ప్రజాశక్తి -తిరుపతి డెస్క్: ఏర్పేడు మండలం మేర్లపాక గ్రామ పంచాయతీలోని అంగన్‌వాడీ కేంద్రంలో బాల్య వివాహాలు, ఆడపిల్లలపై చోటుచేసుకుంటున్న అత్యాచారాలు, స్టాప్ డయేరియా క్యాంపెయిన్, ఓఆర్ఎస్ ఉపయోగాలు, జింక్ మాత్రల ఉపయోగాలపై శనివారం అవగాహన కల్పించారు. సూపర్వైజరు రత్నమ్మ, ఎన్ లావణ్య, ఎం సుజాత, చాందిని, లక్ష్మి, గురమ్మ, పిల్లలు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే పులివర్తి నానిని చంద్రగిరి నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు కృష్ణమనేని సావిత్రి ప్రభాకర్ నాయుడు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. పాకాల మండలంలో నిర్వహించిన ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో ఈ మేరకు సావిత్రి ప్రభాకర్ నాయుడు ఎమ్మెల్యేను కలిశారు.

23న జిల్లా స్థాయి జంప్ రోప్ జట్ల ఎంపిక

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): జిల్లా స్థాయి జంప్ రోప్ జట్ల ఎంపికను ఈనెల 23వ తేదీ తిరుపతి-కరకంబాడి మార్గంలోని బాలచంద్ర మెమోరియల్ హై స్కూల్ లో నిర్వహిస్తున్నట్లు జంప్ రోప్ జిల్లా అసోసియేషన్ కార్యదర్శి సాంబశివరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ 12, అండర్ 14 జంప్ రోప్ జట్ల ఎంపిక పోటీలలో పాల్గొనే క్రీడాకారులు వారి క్రీడా సామగ్రిని వారే తీసుకు రావాలన్నారు. ఈ ఎంపికలకు 2010, జనవరి 1వ తేదీ తర్వాత జన్మించిన వారు అండర్ -14కు, 2012, జనవరి 1వ తేదీ తర్వాత జన్మించిన వారు అండర్ -12 అర్హులన్నారు. జిల్లాస్థాయిలో ఎంపికైన క్రీడా అభ్యర్థులు ఈ నెల 27, 28 తేదీలలో రాష్ట్ర స్థాయి జంప్ రోప్ పోటీలలో కర్నూల్ జిల్లా నంద్యాలలో పాల్గొంటారని పాఠశాల ఛైర్మన్ కృష్ణమూర్తి, కరెస్పాండంట్ ప్రియా, పాఠశాల పిఈటి ప్రమీన ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరాలకు 6300112569, 8341590345 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

పశువులకు టీకాలు

ప్రజాశక్తి - పిచ్చాటూరు: పిచ్చాటూరు మండలం లోని గోవర్ధనగిరి పంచాయతీలో ఆవులు, గేదలు, దూడల కు లంపి స్కిన్ వ్యాధి రాకుండా ముందస్తు చర్యల్లో భాగంగా 198 టీకాలు వేశామని పశువైద్యాధికారిణి డాక్టరు మంజుల తెలిపారు. లంపి స్కిన్ వ్యాధి సోకిన పశువులకు చర్మాలపై పెద్దపెద్ద కురుపులు దద్దుర్లు వచ్చి దోమలు, ఈగలు వాలి ఇతర పశువులకు వ్యాపిస్తాయన్నారు. ఈ వ్యాధి నివారణకు ఫాక్స్ వ్యాక్సిన్ వినియోగిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అనిమల్ హస్బండ్రి అసిస్టెంట్ కె విజయ్ కుమార్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

రాష్ట్ర మంత్రులను కలిసిన జనసేన నాయకులు

ప్రజాశక్తి- వెంకటగిరి: వెంకటగిరికి చెందిన జనసేన, కృష్ణదేవరాయ కాపు బలిజ సంఘం నేతలు నెల్లూరులో ఆంధ్రప్రదేశ్ దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామ్ నారాయణ రెడ్డి, మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ లను మర్యాద పూర్వకంగా కలిశారు. మంత్రులను కలిసిన వారిలో నాయకులు తోట కిష్టయ్య, కోన వెంకటేశ్వరరావు ఉన్నారు.

పచ్చిరొట్ట విత్తనాలు సరఫరా చేయండి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: రైతు సేవా కేంద్రాలకు సకాలంలో పచ్చిరొట్ట విత్తనాలను సరఫరా చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి ప్రసాదరావు ఏపీ సీడ్స్ జిల్లా మేనేజర్ సంపత్ ను కోరారు. శనివారం జిల్లా వ్యవసాయ అధికారి ఏపీ సీడ్స్ ను సందర్శించారు. పచ్చిరొట్ట విత్తనాల సరఫరాపై సమాలోచించారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో రైతులకు పచ్చిరొట్ట విత్తనాల అవసరం ఎంతో ఉందని తెలిపారు. అనంతరం పొయ్య రైతు సేవా కేంద్రం ద్వారా కౌలు రైతులకు కౌలు దారు కార్డులు అందించారు. ఈ కార్యక్రమంలో ఏడిఏపిపి ధనంజయ రెడ్డి, ఏడిఏ రమేష్ రెడ్డి, వ్యవసాయ అధికారులు సుధాకర్ రెడ్డి, సురేందర్ రెడ్డి పాల్గొన్నారు.

చేతక్ 2901 విడుదల



ప్రజాశక్తి -తిరుపతి సిటీ: ప్రముఖ ద్విచక్ర వాహనాల కంపెనీ అయిన చేతక్ తమ సరికొత్త చేతక్ 2901 బ్లూ వాహనాన్ని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జి విసి ప్రొఫెసర్ వి ఉమ చేతుల మీదుగా శనివారం మార్కెట్లోకి విడుదల చేశారు. స్థానిక రేణిగుంట రోడ్ లోని చేత కంపెనీ బ్రాంచ్ లో జరిగిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా బీసీ మాట్లాడుతూ ఆకర్షణీయమైన రంగులతో, మహిళలు, యువత ఇష్టపడే రీతిలో చేతక్ 2901 వాహనాన్ని తయారు చేశారన్నారు. సరికొత్త సాంకేతిక పరిజ్ఞానంతో, కొత్త హంగులతో రూపొందించిన ఈ వాహనాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శ్రీరామ్ బజాజ్ డీలర్ సాకేత్ రామ్ మాట్లాడుతూ ఈ సరికొత్త వాహనంతో ఉత్సాహభరితంగా ప్రయాణం సాగించవచ్చన్నారు. రెడ్, వైట్, బ్లాక్, లైన్ ఎల్లో, అజుర్ బ్లూ కమ్మర్ లో ఇవి లభ్యమవుతాయని, వీటిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసరావు, లక్ష్మీ, కంపెనీ సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో రొట్టెల పండుగ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్థానిక హజరత్ జూమ్లే షాపీర్ దర్గా వద్ద శనివారం రొట్టెల పండుగ భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. దర్గా పీఠాధిపతి సయ్యద్ అహ్మద్ దర్గా నిర్వాహకులు సయ్యద్ బాబా ఫరీద్ ఆధ్వర్యంలో రొట్టెల పండుగ నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు, దర్గా ఉరుసు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల నిరసన

ప్రజాశక్తి -తిరుపతి సిటీ : తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనం ఎదుట కాంగ్రెస్ ఆధ్వర్యంలో మాజీ కేంద్రమంత్రి డాక్టర్ చింతా మోహన్ శనివారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుమల విఐపి బ్రేక్ దర్శనాల లిస్టును ప్రతిరోజూ పబ్లిక్ డొమైన్లో పెట్టాలన్నారు. తిరుమల శ్రీవారి దర్శనాల టికెట్ల కేటాయింపులో పారదర్శకత ఉండాలని, టీటీడీ ఉద్యోగస్తులకు, ప్రభుత్వ ఉద్యోగస్తులకు, తిరుపతి లో పని చేసే వర్కింగ్ జర్నలిస్టులకు జూ పార్క్ స్థలంలో ఇళ్ల స్థలాలు కేటాయించాలని తదితర డిమాండ్లు చేశారు. ఈ కార్యక్రమంలో యార్లపల్లి గోపి గౌడ్, రవి, తేజోవతి, శాంతి యాదవ్, ముని శోభ, వెంకటేష్ గౌడ్, రావణ్ పాల్గొన్నారు.

పంటలు ఎండనివ్వను: ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కురుగొండ్ల

ప్రజాశక్తి - బాలాయపల్లి: మండలంలోని అన్ని చెరువులకు గంగ నీటి ఇచ్చి రైతులు సాగు చేస్తున్న పంటను ఎండ నివ్వకుండా కాపాడే బాధ్యత తీసుకుంటానని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని శ్రీ శక్తి భవనంలో ఎంపీపీ గూడూరు భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకటగిరి గూడూరు రోడ్డు మార్గం పనులు త్వరలో ప్రారంభించేందుకు ప్రత్యేకమైన చర్యలు చేపడతామన్నారు. బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలని కోరారు. ప్రభుత్వ వసతి గృహాలలో అన్ని సదుపాయాలతో చక్కని విద్యను అందిస్తున్నామని గుర్తు చేశారు. పేదల పక్కా ఇల్లు కట్టుకునేందుకు రూ.3 లక్షల 50 వేలు మంజూరు చేసేందుకు ప్రత్యేకమైన చర్యలు చేపడుతున్నామన్నారు. వర్షాలు వల్ల చెరువు కట్టలు స్థితి ఎప్పటి కప్పుడు గుర్తిస్తూ ఉండాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ఎంపీపీ గూడూరు భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ మండలంలోని జంపు గ్రామంలో ప్రాథమిక వైద్య కేంద్రం మంజూరైన రెండేళ్లు దాటుతున్నా ఇంతవరకు వైద్య సేవలు అందించలేదని, ప్రజలందరికీ వైద్యం అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. గురుకుల పాఠశాల మంజూరైనా ఏడాది దాటుతున్నా రెవెన్యూ అధికారులు సంబంధించిన భూమి కేటాయించాలని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అంతేకాకుండా నందలి కడగుంట కైవల్లి నదిపై కాజు వే నిర్మించేందుకు ప్రత్యేక చొరవ చూపాలని కోరారు, అంతే కాకుండా సచివాలయానికి సంబంధించిన సిమెంటు అక్రమాలు చోటు చేసుకోవడాన్ని సర్వసభ్య సమావేశంలో అధికారులు అడుగుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. వాటిపైన ప్రత్యేక ఏర్పాటు చేసి అక్రమ దారులపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ అధికారులు పాల్గొన్నారు.

'చంద్రగిరి-రేణిగుంట' టౌన్ సర్వీసులు ప్రారంభం



నూతన బస్సు సర్వీసును ప్రారంభించిన దృశ్యం

ప్రజాశక్తి - రామచంద్రాపురం (చంద్రగిరి): చంద్రగిరి ప్రజల దీర్ఘకాలిక సమస్యగా ఉన్న ఆర్టీసీ టౌన్ సర్వీస్ బస్సుల సమస్య పరిష్కారమైంది. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని చొరవతో చంద్రగిరి ఆర్టీసీ టౌన్ సర్వీసులు శనివారం పున: ప్రారంభమయ్యాయి. చంద్రగిరి - రేణిగుంట ఆర్టీసీ టౌన్ సర్వీసులు ఎంఎల్ఏ చేతుల మీదుగా ప్రారంభించారు. తిరుపతి నుండి వయా చంద్రగిరి మీదుగా పాకాలకు 8 ట్రిప్పులతో రెండు సర్వీసులు, చంద్రగిరి నుండి రేణిగుంటకు, రేణిగుంట నుండి చంద్రగిరికి నాలుగు సర్వీసులు 21 ట్రిప్పులు తిరిగేలా సౌకర్యం కల్పించామని ఆర్టీసీ ఆర్ఎం చెంగల్ రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే నాని డ్రైవర్‌ను పక్కన పెట్టుకొని బస్సును స్టార్ట్ చేసి కొద్దిదూరం వాహనాన్ని నడిపారు. టౌన్ సర్వీసుల ప్రారంభంతో విద్యార్థులు, ఉద్యోగుల కష్టాలు తీరాయి. నిరుపయోగంగా ఉన్న చంద్రగిరి ఆర్టీసీ బస్టాండ్‌ను తాత్కా లికంగా మరమ్మతులు చేయించి ఉప యోగం లోకి తీసుకొచ్చారు. చంద్రగిరి- అనుపల్లి రహదారిలో ఆర్టీసీ సర్వీసులు నడపాలని ఆర్టీసీ ఆర్ఎం చంగల్రెడ్డిని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్టిసి రీజనల్ మేనేజర్ టి. చెంగల్ రెడ్డి, డిప్యూటి సిటిఎం ఎం. భాస్కర్, డిపో మేనేజర్ టి. బాలాజీ పాల్గొన్నారు.

హాస్టల్ ఉద్యోగులకు కన్వర్షన్ అవకాశం ఇవ్వాలి

టిటిడి ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకుల డిమాండ్



ప్రజాశక్తి తిరుపతి సిటీ: టిటిడి హాస్టల్లో విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగులకు ప్రమోషన్ అవకాశం లేని ఎంపి డబ్ల్యు , వాచెమ్యాన్ , మెయిడ్ సర్వంటు, తదితర క్యాడర్లలో పనిచేస్తున్న ఉద్యోగులకు సర్వర్లుగా కన్వర్షన్ అవకాశం కల్పించాలని టీటీడీ హాస్టల్ వర్కర్స్ యూనియన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) నాయకులు డిమాండ్ చేశారు. తిరుపతిలో జరిగిన టీటీడీ హాస్టల్ వర్కర్స్ యూనియన్ సర్వసభ్య సమావేశంలో టీటీడీ ఎస్‌డబ్ల్యూఎఫ్ (సీఐటీయూ) గౌరవాధ్యక్షులు గోల్కొండ వెంకటేశం, ప్రధాన కార్యదర్శి కాటా గుణశేఖర్ మాట్లాడుతూ టీటీడీ హాస్టల్ విభాగంలో, హాస్టల్ లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని కోరారు. హాస్టల్లో దాదాపు 25 సంవత్సరాలు పైగా పనిచేసి ఒక ప్రమోషన్ అవకాశం లేకుండా రిటైడ్ అవుతున్న ఉద్యోగులకు ఒక ప్రమోషన్ అవకాశం కల్పించాలని కోరుతూ టీటీడీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించుకోవాలని సర్వసభ సమావేశంలో తీర్మానించారు. అనంతరం ఆ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా గోల్కొండ వెంకటేష్, కాటా గుణశేఖర్, అధ్యక్షులుగా సి. రేవంత్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా హనుమంత రెడ్డి, కోశాధికారిగా నరసింహులు, వర్కింగ్ ప్రసిడెంట్ గా లోకేష్‌ను ఎన్నుకున్నారు. ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా సతీష్, అరుణయాగం, ఉపాధ్యక్షులుగా తారక్ రామ్, అశోక్, రమేష్, శ్యామసుందర్, జయంతి, సుబ్రహ్మ ణ్యం రెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా వెంకటేష్, పవన్ కుమార్, కుమార్, మస్తన్ భాషా, మునికృష రెడ్డి, కామేశ్వరయ్య, సుధాకర్‌ను ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా భారత్, సర్వన్ కృష్ణ, శ్రీనివాసులు రెడ్డి, ప్రభాకర్, వంశీకృష్ణ, గిరి, గోపీ, నారాయణ, గణేసులు, వెంకటముని రెడ్డి, మేఘ నాధం, చామండేశ్వరి, అనసూయమ్మ, సుజాత, ధనలక్ష్మి, రామచంద్రయ్య, జానకిరాం, ఎన్ లావణ్య, శారధ, గౌరి, పి.పద్మజ, సురేంద్ర నాయక్, రంజిత్, ఆంజినేయులు, మల్లికార్జున, సంతోషం, జయచంద్ర, నరేంద్ర నాయక్, రాఘవేంద్ర, చంద్రశేఖర్ నాయక్, అశోక్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పల్సర్ ఎన్ఎస్ 400 ఆవిష్కరణ



ప్రజాశక్తి -తిరుపతి సిటీ: ప్రస్తుత పోటీ ప్రపంచాన్ని దృష్టిలో ఉంచుకొని బజాజ్ కంపెనీ నూతనంగా తయారుచేసిన పల్సర్ ఎన్ఎస్ 400 సిసి ద్విచక్ర వాహనాన్ని తిరుపతి ఎమ్మెల్యే ఆరిని శ్రీనివాసులు శనివారం ఆవిష్కరించారు. స్థానిక రేణిగుంట రోడ్డు లోని శ్రీరామ ఎంటర్ప్రైజెస్ లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వినియోగదారుల అభివృద్ధికి తగ్గట్టు ప్రజా సంస్థ ఎప్పటికప్పుడు సరికొత్త మోడల్స్ ని అందరికీ అందుబాటులోకి తీసుకోస్తోంది అన్నారు. వినియోగదారులకు అందించి వారి మనలను పొందడం అభినందనీ యమన్నారు. కొత్త వాహనాన్ని కూడా వినియోగదారుల సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. శ్రీరామ్ బజాజ్ మేనేజింగ్ పార్ట్నర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ 1990లో 34 సంవత్సరాల క్రితం తిరపతిలో బజాజ్ డీలర్ షిప్ ను ఏర్పాటు చేశామన్నారు. అప్పటినుంచి ఇప్పటివరకు సుమారు నాలుగు లక్షల 30 వేలకు పైగా వాహనాలను వినియోగదారులకు క్రయవిక్రయాల ద్వారా అందించామని, నాణ్యతకు మన్నికకు మారుపేరుగా తమ సంస్థ నిలిచిందని, విని యోగ దారులు తమ కొత్త ఆవిష్కరణలను ఆదరిస్తూ తమ వెన్నుంటే నిలబడడం ఆనందంగా ఉందన్నారు. ఫోర్ హండ్రెడ్ సి సి వాహనమైన సిటీ ట్రాఫిక్ లో దృష్టిలో ఉంచుకున్న తయారు చేశారని, తిరుపతి వంటి నగరాల్లో కూడా వీటిని బాగా వినియోగించుకోవచ్చు అన్నారు. బ్లాక్, రెడ్, వైట్, బ్లూ కలర్ లో పల్సర్ 400 సిసి అందుబాటులో ఉన్నాయని, ఈ వాహనానికి బ్లూ టూత్ సౌకర్యం కూడా ఉందని తెలిపారు. దీనిని వినియోగదారుల సద్విని యోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ్ బజాజ్ డీలర్ సాకేత్ రామ్, అభినవ్ రాం, వినియోగదారులు, ప్రముఖులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నాని గౌరవంగా మాట్లాడాలి: కేశవులు



మాట్లాడుతున్న వైసిపి ఎస్‌సి సెల్ అధికార ప్రతినిధి కేశవులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే పులివర్తి నాని మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని అనుచితంగా మాట్లాడడం మంచి పద్ధతి కాదని, ప్రజలు ఇదంతా గమనిస్తున్నారని అందుకు తగ్గట్టు తీర్పు ఇస్తారని వైసిపి రాష్ట్ర ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి దామినేటి కేశవులు అన్నారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ పులివర్తి నానిపై జరిగిన దాడి కేసులో చంద్రగిరి వైసీపీ ఎమ్మెల్యే అభ్యరి చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి ఎలాంటి సంబంధం లేదని, న్యాయపరంగా తాము పోరాడడానికి సిద్ధంగా ఉన్నామని, చంద్రగిరి అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని కక్ష సాధింపు చర్యలు వద్దని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో తిరుపతి రూరల్ వైస్ ఎంపీపీ మాధవరెడ్డి, వెంకటపతి నగర్ సర్పంచి చిన్ని యాదవ్, తిరుచానూరు ఎంపీటీసీ శివశంకర్, భాను, వాసు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

సబ్సిడీ పశుగ్రాస విత్తనాల పంపిణీ



సబ్సిడీ పశుగ్రాస విత్తనాలు పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి -రామచంద్రాపురం: రామచంద్రాపురం మండలం సి రామాపురం రైతు సేవా కేంద్రంలో సబ్సిడీపై పశుగ్రాస విత్తనాలను టిడిపి నాయకులు రామిరెడ్డి, గిరిధర్ రెడ్డి, ధనంజయ రెడ్డిలు శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు పనిచేస్తున్నారన్నారు. ప్రభుత్వం రాయితీతో అందిస్తున్న జొన్న, మొక్కజొన్న విత్తనాలను ఒక్కో రైతుకు 20 కేజీల వరకు అందిస్తారని తెలిపారు. మొక్కజొన్న ఐదు కిలోల బ్యాగు 85 రూపాయలు, జొన్నలు ఐదు కేజీల బ్యాగు 115 రూపాయలు చెల్లించి రైతులు పొందవచ్చని తెలిపారు. రానున్న వేసవిలో పశువులకు పశుగ్రాసానికి కొరత లేకుండా ఉండడానికి పశుగ్రాస విత్తనాలు ఉప యోగపడతాయన్నారు. త్వరలో 90 శాతం సబ్సిడీ పై పశువులు, కోళ్ల ఫారాలు షెడ్లు రైతులు నిర్మించుకు నేందుకు ప్రభుత్వం యూనిట్లు మంజూరు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో కేరామిరెడ్డి, సి మధుసూదన్ రెడ్డి, నీలకంఠారెడ్డి, శ్రీహరి, ఆనందరెడ్డి, రవి వెటర్నరీ అసిస్టెంట్ సోమశేఖర్, రైతులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని నిర్వాకోట లో రైతు గంధం తిరుమల పొలంలో ప్రకృతి వ్యవసాయం సాగు పద్ధతిపై శనివారం అవగాహన కల్పించారు. నిరంతర ఆదాయం వచ్చేలా బుచ్చినాయుడు కండ్రిగ మండలానికి చెందిన ఎల్టీ గంధం ఆశ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో భాగంగా ప్రకృతి వ్యవసాయం వల్ల నెలకు పదివేల రూపాయలు ఆదాయం వచ్చేలా ఆకుకూరలు, అనేక రకాల కూరగాయలను ఆ పొలంలో విత్తనాలు నాటి పొలంలోని రైతుకు ఆ పంట గురించి అవగాహన కల్పించారు. అనంతరం అనంతపురంలో మోడల్‌పై శిక్షణ పొందిన డీఎంఎంట్‌లు వెంకటేశ్వర్లు, సౌందర్య బాబు ఇక్కడి ప్రకృతి వ్యవసాయం సిబ్బందికి పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తూ ఏటిఎం మోడల్ రూపొందించారు. ఈ మోడల్ లో భాగంగా బెండ, చిక్కుడు, ముల్లంగి, క్యారెట్, బీట్‌రూట్, వివిధ రకాల కూరగాయలు, చిర్రాకు, పాలకూర, తోటకూర ఎన్నో ఆకుకూరల సాగుపై వారు మోడల్ చేసి ఆ రైతుకు పూర్తి అవగాహన కల్పించారు. దీనివల్ల నెలసరి ఆదాయం పదివేల రూపాయలు తగ్గకుండా వస్తుందని రైతు ఈ ప్రకృతి వ్యవసాయంపై శ్రద్ధ తీసుకొని చేయాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా ప్రకృతి వ్యవసాయం విభాగం నుండి మల్లికార్జున, ఎంప్టీలు కిరణ్ కుమార్, వెంకటాచలం, డీఎంఎంటిలు వెంకటేశ్వర్లు, సౌందర్య బాబు, యూనిట్ ఇన్‌ఛార్జిలు రామాంజనేయులు, జయ లక్ష్మి, రేవతి, రజనీ ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

జగన్ రాజకీయం మానుకోవాలి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: విపరీతమైన ప్రజా వ్యతిరేకతను మూట గట్టుకుని ఘోర పరాభవం మూటగట్టుకున్న మాజీ సీఎం జగన్ హింస, విధ్వంసం, అరాచకం, అన్యాయం, అక్రమం, అవినీతి గురించి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని జనసేన జిల్లా కార్యదర్శి అంజూరు చక్రధర్ శనివారం విమర్శించారు. రాష్ట్రంలో ఎక్కడ ఏం జరిగినా హత్యా రాజకీయాలంటూ కూటమి ప్రభుత్వానికి అంటగట్టే ప్రయత్నం చేయడం సిగ్గుచేటు అన్నారు.

ఆదర్శ గ్రామంగా పుత్తేరి: ఎమ్మెల్యే

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: మండలానికి దూరంగా ఉన్న పుత్తేరి గ్రామాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసి రోడ్లకు మరమ్మతులు చేసి ఆదర్శ వంతంగా తీర్చిదిద్దుతామని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. మండలంలోని పుత్తేరిలో శనివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఎన్ఆర్ఐ పార్థసారథి పలు సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. గ్రామంలో తాగునీటి సమస్య, విద్యుత్ , రోడ్లకు మరమ్మతులు, సత్యవేడు నుంచి గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పుత్తేరి టిడిపికి కంచుకోట అని ఒక ప్రణాళిక ద్వారా ప్రజా సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా సత్యవేడు నియోజకవర్గ టిడిపి పి చంద్రశేఖర్ నాయుడు గత ప్రభుత్వం అభివృద్ధిని గాలికి వది లేసిందని విమర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కిట్లు, రైతులకు జీలగలు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. సర్పంచ్ రామూర్తి, గ్రామ నాయ కులు, ఎన్ఆర్ఐ పార్థసారథి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే, అబ్జర్వర్‌ను గజమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు సుధాకర్ నాయుడు జిల్లా గ్రంథాలయ మాజీ ఛైర్మన్ కన్నయ్య నాయుడు, నాయకులు మధు నాయుడు, సుధాకర్‌నాయుడు, వీరరాఘవులు, వెంకటాచలం, రాజేంద్ర, ఎంపీడీవో త్రివిక్రమరావు, డిప్యూటీ తహశీల్దారు చంద్రబాబునాయుడు, ఎంఈవో రవీంద్రనాథ్, అగ్రికల్చర్ అధికారి భారతి, ఉపాధి హామీ ఏపిఓ భానుప్రియ, ఏపీఎం ఇందిర, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు .



విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

'అమరరాజ' డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం): ఎస్‌వి అరవింద్ కంటి ఆస్పత్రి తిరుపతి వైద్య బృందం సహకారంతో రాజన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో అమరరాజా డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షా శిబిరాన్ని శనివారం నిర్వహించారు. అమరరాజా గ్రూప్ సప్లై చైన్ మేనేజ్మెంట్ అధ్యక్షులు ఎల్.వెంకట్ మాధవ్ మాట్లాడుతూ డ్రైవర్లకు కంటి చూపు ముఖ్యమని, ఈ కారణంగానే ఉచిత కంటి పరీక్షా శిబిరాన్ని నిర్వహించామన్నారు. దాదాపు 200 మంది లారీ డ్రైవర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో అమరరాజా జనరల్ మేనేజర్ ఆర్.చంద్రబాబు, రాళ్లపల్లి సతీష్, డాక్టర్ శ్రీలత పాల్గొన్నారు.

హనుమ అవార్డ్స్ నాటకోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్, భారత ప్రభుత్వ సాంస్కృతిక శాఖ న్యూఢిల్లీ, ఆంధ్ర రాష్ట్ర సృజనాత్మకత, సాంస్కృతిక సమితి సంయుక్త సహకారంతో అభినయార్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న హనుమా అవార్డ్స్ నాటకోత్సవాలు శనివారం తిరుపతిలో ప్రారంభమయ్యాయి. స్థానిక మహతి ఆడిటోరియంలో జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాజీ టిటిడి బోర్డు సభ్యులు పోకల అశోక్ కుమార్ మాట్లాడుతూ కళ చాలా గొప్పది దీనిని ప్రోత్సహించడం అభినందనీయమని ప్రశంసించారు. ఎనిమిది రోజులు పాటు జరిగే ఈ నాటకోత్సవాలను ప్రతి ఒక్కరు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అంతకుముందు ఉదయం ప్రదర్శించిన పలు నాటకాలు కళాకారులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో బి.ఎన్.రెడ్డి, మబ్బు సూర్యనారాయణ రెడ్డి, విశ్వ విద్యాసంస్థల అధినేత విశ్వనాథరెడ్డి, గేట్ డిగ్రీ కళాశాల చైర్మన్ వెంకటేశ్వర్లు, ప్రముఖ మిమిక్రీ ఆర్టిస్ట్ విజయకుమార్, గుండాల గోపీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు గంగ జాతర కమిటీ సమావేశం

ప్రజాశక్తి -పుత్తూరు టౌన్ : స్థానిక బజారు వీధిలో పిడికిలి గంగమ్మ జాతర నిర్వహణకు నేడు జాతర కమిటీ సభ్యులు ఆదివారం సమావేశం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఆనవాయితీగా ద్రౌపదీ దేవీ సమేత ధర్మరాజుల ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు అనంతరం, వినాయక చవితికి ముందు పుత్తూరు పట్టణంలోని బజారు వీధిలోని గంగమ్మకు జాతర నిర్వహించడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో నిర్వాహక కమిటీ సభ్యులు ఆదివారం ఉదయం 7 గంటలకు బజారు వీధిలోని సుందరం కూల్డ్రింక్స్ షాపు వద్దకు గంగ జాతర కమిటీ సభ్యులు, పుర ప్రజలు రావాలని కోరారు. ఈ గంగజాతర నిర్వహణకు సభ్యులు సలహాలు, సూచనలు చేయాలని కోరారు.

'నారా లోకేష్ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం'

తిరుపతి (మంగళం) : ఫీజు రీయింబర్స్‌మెంట్ నగదును విద్యార్థుల కళాశాల ఖాతాలలో జమ చేయాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని గిరిజన నవ సమాజ్ వ్యవస్థాపక అధ్యక్షులు పాలిత్య శివశంకర్ నాయక్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో విద్యార్థుల తల్లిదండ్రుల ఖాతాల్లోకి విద్యా దీవెన, వసతి దీవెనల పేరుతో అప్పటి ప్రభుత్వం జమ చేసిందన్నారు. కళాశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు సకాలంలో ఫీజు రీయింబర్సుమెంట్ జరగక యాజమాన్యం నుండి విద్యార్థులు అనేక ఒత్తిళ్లను ఎదుర్కోవాల్సిన పరిస్థితులు వచ్చాయన్నారు. ఆ సమయంలో విద్యార్థుల తల్లిదండ్రులు ఎంతో వ్యయప్రయాసలతో అప్పులు తీసుకొచ్చి కళాశాలలకు ఫీజు చెల్లించిన సందర్భాలు ఉన్నాయన్నారు. పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ నగదును కూడా బదలాయింపు చేయాలని విజ్ఞప్తి చేశారు.

గంజాయి బ్యాచ్‌లపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - క్యాంపస్ : గంజాయి బ్యాచ్‌ను, రోడ్లపై బైక్ స్టంట్లు వేస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలని తిరుపతి ఎస్‌పి ఎల్ సుబ్బరాయుడుని టిఎన్ఎస్ఎఫ్ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు కొట్టే హేమంత్ రాయల్ శనివారం కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతి నగరంలో కొంతమంది ఆకతాయిలు, మహిళా విశ్వవిద్యాలయం, మహిళా వసతి గృహాలు, శ్రీనివాస సేతు, జాతీయ రహదారులపై విచ్చలవిడిగా ద్విచక్ర వాహనాలను ప్రమాదకరమైన స్టంట్లు చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. తిరుపతిలోని పలు మెడికల్ షాపుల్లో ప్రిస్క్రిప్షన్ లేకుండా మత్తు మాత్రలు, టానిక్‌లు అమ్ముతూ యువతను పెడదారి పట్టిస్తున్నారని, ఇలాంటి మందులు షాపులను గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తిరుపతి టీఎన్ఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి మైలారి అశోక్, నగర అధ్యక్షులు వెంకటేష్ యాదవ్, జానీ యాదవ్, భరత్, జ్ఞానేష్ పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణ

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: నవ భారత్ సేవా సమాజ్ సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు వృత్తి విద్య, నైపుణ్య శిక్షణ కోసం నూతన కేంద్రాన్ని సీనియర్ నేత మబ్బు దేవనారాయణరెడ్డి కట్టకిందపల్లి (కొత్తఊరు) తిరుపతిలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హోటల్ భీమాస్ రెసిడెన్స్ కె.ఆర్.వెంకటాచలం, చక్ర హాస్పిటల్ డా.అర్చన గౌరవ అతిథిలుగా పాల్గొన్నారు. సంస్థ ప్రధాన కార్యదర్శి రహమతుల్లా షరీఫ్ శిక్షణా కార్యక్రమానికి సంబంధించిన సామాగ్రిని అందజేసి 3 నెలల ఉచిత టైలరింగ్ శిక్షణ కోర్సు పూర్తి చేసుకున్న మహిళలకు సబ్సిడీ రుణం పొందేందుకు సర్టిఫికెట్ అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమలో జనశిక్షణ సంస్థాన్ శాఖ అధికారి సుధాకర్ , నవ భారత్ సేవా సమాజ్ సిబ్బంది డి.సుజాత పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై దృష్టి సారించండి: ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణ లోని అభివృద్ధి పనుల పై అధికారులు దృష్టి సారించాలన్నారు. శనివారం గూడూరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే సునీల్ కుమార్ పురపాలక అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శీలం కిరణ్ కుమార్, పట్టణ అధ్యక్షులు పులిమి శ్రీనివాసరావు, నాయకులు నిమ్మకాయల నరసింహులు, తాతపూడి ఇశ్రాయేల్ కుమార్, దువ్వూరు రవీంద్ర రెడ్డి పాల్గొన్నారు.